

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



## చిన్ననాటి ప్రమాణాలు

**ఇప్పటికి ఇరవై రెండు** కాగితపు కమలాలు చేశా, ఇంకో మూడు చేస్తే అనుకున్న థీమ్ కి సరిపోను 'పేపర్ ఫ్లవర్స్' తయారైపోతాయి. ఊరకనే ఉండదు ప్రాణం. పిల్లదాని పుట్టినరోజు మరి! చిటికెల మీద ఆర్డర్లు ఇచ్చి చేయించడానికి ఇప్పటి భారతదేశపు వారంత గొప్పవారము కాదు కదా? అమెరికా అంటేనే "డ్.ఐ.వై." అల్మారాలు బిగించటం నుండి మందారం చెట్టుకి అంట్లు కట్టడం వరకూ అన్నీ స్వయంగా చేసుకోవలసిందే. తెలుసుకోవలసిందే! అసలు నేను ఇంత సమర్ధవంతంగా 'మల్టీ టాస్కింగ్' చెయ్యగలనని ఇక్కడికి వచ్చాకే తెలిసింది.

ఇలా నా 'టైం మానేజ్మెంట్' స్కిల్స్ , 'మనీ మేనేజ్మెంట్' స్కిల్స్ తలచుకుని మురిసిపోయేలోపు పొద్దునే అమ్మ చేసిన ఫోన్ కాల్ గుర్తొచ్చింది. దాంతో పాటు కస్సుమని కోపం, విసుగూ, చికాకు కూడా ముంచుకొచ్చాయి.

ఏదో నా పాటికి నేను వనవాసం చేసుకుంటున్నానా? ఊరికెనే ఉండదు. నాకు రెండు నెలలప్పుడు మా పక్కింట్లో ఉండి వెళ్ళిన వాళ్ళ దగ్గరినుండి, తిరుపతి వెళ్ళేప్పుడు ట్రైన్ లో ఒకసారి కలిసి ఫోన్ ఫ్రెండ్స్ అయిన వాళ్ళ వరకు ఎవరు అమెరికాలో మా ఊరు వచ్చినా నా వివరాలు ఇచ్చి పంపుతుంది మాట్లాడమని. ఎంత మొహమాటంగా ఉంటుందో అర్ధం చేసుకోదూ! ఈ ఫోన్లు ఉండి ఉంటే హాయిగా పక్షులతోనూ, జింక పిల్లలతోను అడవుల్లో ఆడుకుంటూ ఉండే సీతమ్మ దగ్గరికి కూడా 'మిథిల నుండి మీ అమ్మగారు పంపించారు' అని జాడ కనుక్కుని వచ్చేసి ఉందురు. ప్రపంచం చిన్నదీ చిన్నది అంటే ఏమిటో అనుకున్నాను గానీ ఇప్పుడు తెలిసి వస్తోంది. టెక్నాలజీ మరీ అగ్గిపెట్టెలో పెట్టేసింది ప్రపంచాన్ని.

కలవడం ఇబ్బంది కాదు. ప్రతి కాలంలో కొన్ని ఎదుర్కోలేని ప్రశ్నలు ఉంటాయి. అవి వినగానే ఉన్నపాటున కాలం అనే లైవ్ వీడియో టెలికాస్ట్ పై కసితీరా 'పాస్' బటన్ నొక్కెయ్యాలి అనిపిస్తుంది. విఠలాచార్య సినిమాల్లో మంత్రం నిజమై నేను మాయమైపోవాలి అనిపిస్తుంది. అరె! చిన్నా లేదు పెద్దా లేదు ప్రతి ఒక్కరు అటు తిరిగి ఇటు తిరిగి ఒకటే ప్రశ్న దగ్గర ఆగుతారు .. "ఉద్యోగం చేస్తున్నావా అని?" ఈ విషయం తెలుసుకోనిదే ఏ పరిచయాలు ముందుకి వెళ్లవు. అవకాశాలు ఉంటే అందరూ చేసేవారే ఇప్పట్లో.

"లేదండి."అని చెప్పామే అనుకోండి .."ఎందుకు? ఏమిటి? ఎలా?" అని టపీ టపీ మని ఒకటే ప్రశ్నల పరంపర. కర్ణుడి చావుకి కారణాలు అనేకం అన్నట్టు బోలెడు వీసా ముడులు మరి. ఒక వైపు నుండి ముడి విడదీస్తోంటే ఇంకో వైపు నుండి కొత్త ముళ్ళు బిగిస్తూ వస్తోంది ఇక్కడి వ్యవస్థ.

ఒకవేళ వివరంగా చెపుదామన్నా మన కంఠ సోష తప్పించి అర్థం చేసుకునే ప్రయత్నం చేయరు. అన్నిటికన్నా 'అయ్యో! ఖాళీగా ఉన్నావా పాపం' అనే ఆ జాలి చూపులు భరించడం కన్నా ఉదయాన్నే పరగడుపున 'త్రిఫల చూర్ణం' తాగడం ఇంకా సులువు.

మొదటి తరం వారిలో ఉద్యోగాలు చేసే ఆడవారిని ఆశ్చర్యంగా చూసేవారు. ఇళ్లు, పిల్లలని పట్టించుకోరని సాధించేవారు. అమ్మాయిలకు 'మల్టీ టాస్కింగ్' ఒక లెక్కా ? ఉద్యోగాలు చేస్తూనే హాయిగా అటు పిల్లల్ని ఇటు ఇంటి ఆర్థిక వ్యవస్థని ఒక గట్టుకి లాక్కొచ్చిన వారిని చూసి ఇదే కరెక్టు పద్ధతి అని మాట మార్చేశారు. ఇప్పుడేమో ఉద్యోగం లేకపోవడమే పెద్ద లోటు అయిపోయింది. 'చదువు–ఉద్యోగం–జీతం' తప్పించి వేరే లెక్కలు లేవు ఎక్కడా! ఇంతకు ముందు వంటా వార్పు, కుట్లు–అల్లికలు వచ్చా అని అడిగేవారు. ఇప్పుడు 'ఎంత ప్యాకేజీ?', 'పెళ్ళికి ముందు సంపాదన ఏమి చేసావు?', 'పెళ్లి తర్వాత ఏమి చేస్తావు?' అనే ధోరణిలోకి వచ్చింది సమాజం. మనసుకి నచ్చిన చదువు, కొలువు అనేది అందని కల చాలా మందికి. ఇప్పటి కాలానికి, వేగానికి తగ్గ లాభం తెచ్చిపెట్టే కొలువుల పైనే అందరి గురి. అవి సాధించేవారే విజేతలు.

చదువు అనేది అందరికీ అలంకారమై పోయింది. దానితో పాటూ పోటీ కూడా విపరీతంగా పెరిగిపోయింది. చేతిలో విద్య పెట్టుకుని ఊరికెనే కూర్చోలేము. తోటి వారిని చూస్తూ స్థిమితంగా ఉండలేము. ఒక విధమైన వేగానికి, చురుకుగా ఆలోచించే విధానానికి అలవాటు పడిన బుర్రలు, కుట్టి పెట్టినా ఉరికెనే ఉండవు. ఉద్యోగం అనేది చదువుకున్న వారందరి గుర్తింపు అయిపోయింది. కొలువు ఇచ్చే ఆత్మస్థైర్యానికి గులాములం మేము. మా అవసరం, విలువ గుర్తించే ఉద్యోగం అంటే అందుకే అంత ఇష్టం మాకు. యుద్ధ విద్యలన్నీ నేర్చుకుని సంసిద్ధంగా ఉన్న వీరుడు 'విజయమో వీర స్వర్గమో?' అని ఉవ్విళ్ళూరుతూ ఉంటాడు కానీ నిలువెత్తు బంగారం ఇచ్చినా రణ రంగానికి వెళ్లకుండా ఆపలేము కదా? అలా ఉంది ఈ కాలం అమ్మాయిల పరిస్థితి. అందుకే ఎవరిని కదిలించినా బోలెడు వీర 'వీసా– ఉద్యోగ' గాథలు. అన్నిటిని సంబాళిస్తూనే రాణిస్తున్న వారిని చూస్తే చెప్పలేని ముచ్చట.

ఈసారి అమ్మ కలవమని చెప్పింది నిఖిల్ ని. నాతో పాటు చిన్నప్పుడు స్కూల్లో రెండేళ్లు చదివి ట్రాన్స్ఫర్ అయ్యి వెళ్లిపోయిన నిఖిల్. తరువాత అతని సంగతే మరచిపోయాను. అమ్మ చెప్పాక గుర్తొస్తోంది. పోలీస్ క్వార్టర్స్ లో ఉండే వాళ్ల ఇల్లు. సంవత్సరం మధ్యలో రావడం వల్ల తను మిస్ అయిన నోట్స్ కోసం మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చిన తను, వాళ్ళ అమ్మగారూ. అమ్మ, ఆంటీ కబుర్లలో పడేసరికి ఇద్దరం కలిసి మా ఇంటి దగ్గరలో ఉన్న రామాలయం వెళ్లి స్థంబాల

చాటున ఆడుకున్న దాగుడు మూతలు. అన్నీ గుర్తొస్తున్నాయి. చాలా మంచి స్నేహం కుదిరింది. సోషల్ స్టడీస్ తన ఇష్టమైన సబ్జెక్టు. నేను స్టాంప్ కలెక్షన్, కాయిన్ కలెక్షన్ ఫస్ట్ టైం తన దగ్గరే చూసాను. తన బర్త్ డే కి వెళ్ళినప్పుడు ఆంటీ కుక్కర్ లో చేసిన వెన్న కేక్ రుచి ఇంకా గుర్తే. చాలా చిత్రమైన విశేషాలు చెప్తూ ఉండేవాడు. క్లాస్ బుక్స్ కాకుండా జనరల్ నాలెడ్జ్, ఫన్ ఫాక్ట్స్ కి సంబంధించి బుక్స్ పరిచయం చేసింది తనే. బ్యాటరీలు వాడి చిన్ని లైట్ వెలిగించడం, వాచ్ డయల్ వెనుక ఊడదీసి అందులో పార్ట్స్ అన్ని వివరించడం, సగం కట్టి వదిలేసిన మా ఊరి మెడికల్ కాలేజీ శిథిలాల్లో డిటెక్టివ్ ల్లాగా తిరగడం గుర్తొస్తున్నాయి. చాలా హుషారుగా ఉండేవాడు. గూగుల్ లేని రోజుల నాటి స్నేహం మరి. అప్పటికి తనే నా గూగుల్. సెవెంత్ క్లాస్ మధ్యలోనే అంకుల్ కి ట్రాన్స్ఫర్ అయిపోడంతో అక్కడికి ఆగిపోయింది ఆ స్నేహం. తరువాత జాడ తెలీలేదు.

నేను తరువాత చదువుల్లో పడి మర్చిపోయాను. అమ్మని ఆంటీ ఫేస్బుక్ లో ఏదో గ్రూప్లో కామన్ ఫ్రెండ్స్ లిస్ట్ లో చూసి మళ్లీ కలుసుకుందిట. దాంతో పాటూ మా విశేషాలు, వివరాలు కూడా మార్చుకున్నారు. ఎప్పుడో అయిదో క్లాసులో కలిసిన నేస్తం. అక్కడికీ ఫేస్బుక్ లో తన ఐడి చూసాను. రకరకాల ప్రదేశాల ఫోటోలు ఉన్నాయి. చిన్నప్పుడు అట్లాస్ పట్టుకుని ఇక్కడికి వెళ్ళాలి, ఇవి చూడాలి అని అంటూ ఉండేవాడు. తన ఫొటోస్ లో కూడా అవే విశేషాలు. కలవాలంటే ఒకవైపు సంతోషంగా ఉన్నా, ఇంకో వైపు ఏదో బెరుగ్గా ఉంది.

కంపెనీ పని మీద శాన్ ఫ్రాన్సిస్కో వచ్చి ఈ వారాంతం నన్ను కలుస్తానని చెప్పాడు. ఇద్దరి చోటుకి హాఫ్ డిస్టెన్స్ లో ఉండే ఇండియన్ రెస్టారెంట్ లో కలుసుకుందామని అనుకున్నాము. దాదాపు మర్చిపోయిన ఆ కొన్ని జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ పిల్లదాని పుట్టినరోజు డి.ఐ.వై పనులు కానిస్తున్నాను.

ఇల్లు షిఫ్ట్ చేస్తున్న ఫ్రెండ్ కి సాయం చెయ్యడానికి వస్తానని మాటివ్వడంతో ఈయన రాలేనని చెప్పేసారు. అనుకున్న రోజుకి పాపని తీసుకుని వెళ్ళాను నేను నిఖిల్ ని కలవడానికి. దాదాపు ఇరవై ఏళ్ల తరువాత కలుసుకుంటున్నాం. ఏం మాట్లాడతాము? అందుకే కోపం వస్తుంది అమ్మ మీద. చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుచేసుకోడానికి, తలచుకోడానికి బాగుంటాయి కానీ అవి ఇరవయ్యేళ్ళ తరువాత ఎదురుగా రూపు రేఖల్ని మార్చేసుకుని నిలబడితే ఏం చెయ్యాలి? ఎలా రిసీవ్ చేస్కుంటాడో తెలీదు! తనూ వాళ్ల అమ్మ బలవంతం మీద కలుసుకోడం లేదు కదా? 'జాబ్, ప్యాకేజి, బిజీ' అని ఓవర్ ఆక్షన్ చేస్తే మటుకు తిరిగి వచ్చేస్తా. ఈ మధ్య అసలు ఎవర్ని మాట్లాడిద్దామన్నా ముందుగానే మెసేజ్ పెట్టి బిజీ గా లేరు కదా అని కనుక్కుని మాట్లాడాల్సి వస్తోంది. ఇలా రకరకాల ఆలోచనలతో వెళ్లాను రెస్టారంట్ కి.

ఫేస్బుక్ లో చూడడం వల్ల వెంటనే గుర్తు పట్టేసాను. సంతోషంగా రిసీవ్ చేసుకున్నాడు నన్ను, పాపని. చాలా సునాయాసంగా ఇరవై ఏళ్ల వెనక్కి తీసుకుని వెళ్ళిపోయాడు. అదే హుషారు అదే అల్లరి. అప్పట్లో నేనెలా వెంటనే తనతో

స్నేహం చేసానో పాప కూడా వెంటనే కలిసిపోయింది. నేను కూడా మరచిపోయిన సంఘటనలు బోలెడు గుర్తు చేసాడు. ఎన్నో కబుర్లు దొర్లాయి మా మధ్యన. నా చదువు, పెళ్లి, కుటుంబం గురించి మాటల్లో అడిగినట్లే ఉంది తప్పించి నన్ను అసలు ఏ విధంగానూ అంచనా వేస్తున్నట్టే లేదు. నిన్న సాయంత్రం ఆటలు ఆడి మరునాడు మళ్లీ కలిసినప్పటిలాగే మాట్లాడాడు.

ఇహ లేద్దాం అనుకుంటూ ఉండగా ఒక చిన్ని పార్సెల్ తీసి ఇచ్చాడు. తెరిచి చూద్దును కదా మహాబలిపురం, హంపి, తంజావూరు, కోణార్క్ ఇలా రకరకాల ప్రదేశాల్లోని అందమైన శిల్పాలు, తన ఫోటోగ్రఫీ నే అట. ఎంత చక్కగా వాటి డీటెయిల్స్ తో సహా చేసి ఉన్న 'ఫోటో బుక్.' చిన్నప్పుడు పోస్ట్ కార్డ్స్ మీద ఇలా హిస్టారికల్ ప్లేసెస్ వి ఫోటోలు వచ్చేవి. అవన్నీ కలెక్ట్ చేసేవాళ్ళం. ఎప్పటికైనా ఈ ప్రదేశాలు చూడాలని వాటి గురించి తెలుసుకోవాలి అని అనుకుంటూ ఉండేవాళ్ళం . లీల గా గుర్తొస్తోంది. తను ఆ కల నిజం చేసుకున్నాడు.

సంవత్సరానికి ఒక సారి బ్రేక్ తీసుకుని ఇలా తనకి ఇష్టమైన ప్రదేశాలు తిరుగుతూ, ఫొటోస్ తీయడం తన ప్యాషన్ ట. రెండు మూడు ట్రావెల్ మ్యాగజైన్స్ లో కూడా తన పిక్స్ వచ్చాయట. చాలా సంతోషంగా అనిపించింది నాకు. 'చదువు – ఉద్యోగం' అనే లక్ష్యం మాత్రమే పెట్టుకుని గంతలు కట్టిన గానుగ ఎద్దు లా కాకుండా ఎంత చక్కగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు ఈ అబ్బాయి అని.

అలా అబ్బుర పడుతుండగా అప్పుడు అడిగాడు నన్ను "నువ్వు ఏమి చేస్తున్నావు ?" అని.

ఉలిక్కిపడి సర్దుకుని అలవాటైన సమాధానం లాగా పోగేసుకున్న డిగ్రీలు, ఉద్యోగం కోసం చేస్తున్న విక్రమార్క ప్రయత్నాలు చెప్పుకుంటూ పోతుంటే మధ్యలోనే ఆపేసాడు నన్ను..

"అబ్బా! అవన్నీ అందరికీ తప్పని పాట్లు. నీకోసం నువ్వు ఏం చేస్తున్నావు అని!"

నేను ఏమి సమాధానం చెప్పాలో తెలీక అలా ఉండిపోయాను. చదవడం , పెళ్లి చేసుకోడం, పిల్లలు ఇవి కాకుండా ఇప్పుడు ఉద్యోగం! ఇవే కదా ఇప్పటి వారి విజయవంతమైన జీవిత లక్ష్యాలు . ఇవి కాకుండా ఏం చేస్తారు? అని ఆలోచించడం మొదలు పెట్టాను.

నిజమే ఇవన్నీ బ్రతకడం కోసం కదా. జీవించడానికి, జీవితాన్ని ప్రేమించడానికి మనకి ఇష్టమైన పనులు, మనసుకి ఆనందాన్ని ఇచ్చే పనులు చెయ్యడం ఎంత ముఖ్యమో కదా! ఎంత ఆలోచించినా ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేక పోయాను. జీవితాన్ని ఆస్వాదించలేనంత యాంత్రికంగా తయారవుతున్నానా? అని భయం వేసింది.

ఇలా నా ఆలోచనల్లో నేను ఉండగానే పాప కోసం కొన్న ఒక జర్నల్ తీసి ఇచ్చాడు నిఖిల్. "ది థింగ్స్ ఐ విల్ డు " అని పెద్దయ్యాకా ఏవేవి చెయ్యాలో రాసుకునే అందమైన బొమ్మలు ఉన్న జర్నల్. పాప కళ్లలో అప్పుడే కనపడుతున్న బోలెడు ఆశలు, ఆశయాలు.

నిజమే, చిన్నప్పుడు ఎన్నెన్ని సాధించాలి అనుకుంటామో! కాలంతో పాటుగా వచ్చే మార్పుల వల్ల ఆ కలలు మరచిపోకుండా ఉండేలా, చిన్నప్పటి మనతో మనం చేసుకున్న ప్రమాణాలు గుర్తు చేసే ఒక జర్నల్ ఉంటె ఎంత బాగుండు అనిపించింది.

ఈసారి హడావిడిగా కాకుండా మా ఇంటికి  తప్పకుండా రావాలి అని నిఖిల్ దగ్గర వీడ్కోలు తీసుకుంటూ చెప్పాను , ‘ఈసారి కలిసేటప్పటికి నీ  ప్రశ్నకి సమాధానం ఖచ్చితంగా చెప్తాను నిఖిల్’ అని.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments